# ఓటు హక్కును వినియోగించుకోవాలి

- వంద శాతం పోలింగ్ నమోదుకు అధికారులు పనిచేయాలి
- ఓటరు నమోదుకు ఈ నెల 31 చివరి తేదీ
- నవంబర్ 5 నుంచి 25 తేదీ వరకు ఓటరు గుర్తింపు స్లిప్పులు అందజేస్తాం
- శివ్వంపేట జడ్పీ పాఠశాలలో ఓటరు నమోదుపై అవగాహన
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



ఓటరు నమోదు కోసం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శివ్వంపేట, అక్టోబర్ 27 : వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన శివ్వంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు ప్రాముఖ్యతపై ఓటర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 శాతం ఓటింగ్ లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఆదేశించారు. అధికారులు అందరూ ప్రజలకు ఓటు చైతన్యవంతులుగా తయారు చేయాలని పిలుపు నిచ్చారు. ఎవరు ఎన్ని ప్రలోబాలకు గురిచేసినా ఎవరికీ లొంగకూడదని, ఓటు బ్రహ్మాస్త్రం అని అన్నారు. దేశాన్ని ప్రభావితం చేసే శక్తి అని, దేశంలో ఉన్న ప్రజలందరికీ ఓటు విలువ సమానంగా ఉంటాయన్నారు. ఓటు దుర్వినియోగం చేయకూడదని, ఎవరైనా ఓటు నమోదు చేసుకోక పోతే, ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, ఓటింగ్‌లో గతంలో 3వ స్థానంలో ఉన్న జిల్లా మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఓటర్లకు నవంబర్ 10 నుంచి 25తేదీ వరకు ఓటరు గుర్తింపు స్లీప్‌లు అందజేస్తామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ దగ్గర ఓటరు అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని ఏదైనా ఓటరుకు సందేహం ఉంటే ఓటరు అసిస్టెంట్ బూత్‌లో చెక్ చేసుకోవచ్చని అన్నారు. ఓటింగ్ రహస్య పద్ధతిలో జరుగుతుందని తెలియజేశారు.



అవగాహన సమావేశానికి హాజరైన ప్రజలు

జిల్లాలోని రెండు నియోజక వర్గాల్లో ఓటరు చైతన్య రథం ద్వారా ప్రచారం చేస్తున్నదని, 100 శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం చేస్తుందని తెలిపారు. ఓటరు చైతన్య రథం జిల్లాలో ప్రధాన కూడళ్లు, మార్కెట్స్, బస్ స్టాండ్ లు, జాతరలు, షాపింగ్ మాల్స్, కాలనీల్లో ప్రచారం చేస్తుందని, కళాకారులు ఆట పాటలతో ప్రజలకు చైతన్యం కల్గించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ ఏదైనా ఫిర్యాదులు ఉంటే సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని డబ్బు, మద్యం, ఏదైనా వస్తువుల పంపిణీ జరిగినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలియజేశారు. అంతకుముందు ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఆర్డీవోలు శ్రీనివాసులు, రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి, ఎంఈవో బుచ్యానాయక్, సీఐ శ్రీధర్, ఎస్సై రవికాంత్‌రావు, తెలంగాణ సంస్కృతిక శాఖ కళాకరులు, ఓటర్లు పాల్గొన్నారు.

## నిందితుడికి జైలు

హత్నూర,అక్టోబర్ 27: మహిళపైదాడి చేసి అవమానించిన వ్యక్తికి రెండేండ్లు జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రత్యేక మొబైల్‌కోర్టు జడ్జి శ్రీమతి అనిత తీర్పు వెలువరించినట్లు హత్నూర శుక్రవారం ఎస్సై సుభాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. హత్నూర మండలం నవాబుపేట గ్రామానికిచెందిన ఓమహిళ 2016 నవంబర్ 4న ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అదే గ్రామానికి చెందిన నాగఅబ్రహం తండ్రి అర్జున్ మహిళపై దాడిచేసి అవమానించినందుకు బాధిత మహిళ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై బాల్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా, విచారణ అనంతరం కోర్టు చార్జిషీట్ దాఖలు చేయగా, కేసు వాదోపవాదాలు విన్న తర్వాత శుక్రవారం సంగారెడ్డి ప్రత్యేక మొబైల్‌కోర్టు జడ్జి అనిత నిందితుడికి రూ.200 నగదుతో పాటు రెండేండ్ల జైలుశిక్ష విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లతీఫ్ ఉర్ రెహమాన్ వాదనలు వినిపించారు. సాక్షాలు సమర్పించడంలో కీలకంగా వ్యవహరించిన కోర్టు కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను ఉన్నత అధికారులు అభినందించారు.

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో బీఆర్‌ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా

ములుగు, అక్టోబర్ 27 : తెలంగాణలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొలువుతీరనున్నదని బీఆర్‌ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు మహ్మద్ జుబేర్‌పాషా అన్నారు. ములుగు మండల పరిధి కొత్తూరులోని మజీద్‌లో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకొని ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కానున్నదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో గ్రామస్తులంతా బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతు తెలుపుతామంటూ ఏకగ్రీవ తీర్మాణాలు చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల పార్టీలు చేసింది శూన్యమని, ఎన్నికల్లో వారికి డిపాజిట్లు కూడా దక్కవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఆసీఫ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హైగ్రో కెమికల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

బొల్లారం, అక్టోబర్ 27: బొల్లారం పారిశ్రామిక వాడలోని హైగ్రో పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని ఆరోబ్లాక్‌లో కెమికల్ రియాక్షన్స్ వలన అగ్ని కిలలు ఎగసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా నల్లని దట్టమైన పొగ కమ్ముకోవడంతో పరిశ్రమలోని కార్మికులు సిబ్బంది భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఆస్తినష్టం ఎంత జరిగిందనేది తెలియాల్సి ఉన్నది. ప్రమాద ఘటనపై బొల్లారంసీఐ నయీమొద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కార్మిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి, ఆనంద్‌కృష్ణారెడ్డి పరిశ్రమను పరిశీలించారు.

## గ్రామాల్లో బీజేపీ ప్రచారానికి నిరసన సెగలు

చేగుంట, అక్టోబర్ 26: చేగుంట మండలంలో బీజేపీ ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో నిరసన సెగలు తగిలాయి. దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునంధన్ రావు తాను గెలిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తా, ఇండ్లు లేనివారికి ఇల్లు కట్టిస్తా, రైతులకు రెండు కాడిఎడ్లను ఇప్పిస్తానన్ని ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చాడు. గెలిచిన తర్వాత హామీలు మర్చిపోవడం, గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో గ్రామాలకు ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేను ప్రజలు నిలదీశారు. మూడు రోజుల క్రితం చేగుంట మండలం చందాయిపేట, కసాన్‌పల్లి, అనంతసాగర్, ఉల్లి తిమ్మాయిపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో బీజేపీ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో మహిళలు, వృద్ధులు ఏమి అభివృద్ధి చేసి వచ్చావని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ దివంగత రామలింగరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామాలకు వచ్చి అభివృద్ధి పనులు చేసేవాడు. అందరి గురించి అడిగేవాడు. రామలింగారెడ్డి యాల్ల పొద్దుగా పోయిండు. ఇగ ఈ ఎమ్మెల్యే రఘునంధన్‌రావు ఓటు వేసినప్పుడు వచ్చిండు...మళ్లీ గిప్పుడే కనబడుతుండు. ఏమన్న అంటే నన్ను లావుడుదని మాట్లాడుతున్న దంటారు. గెలిచినంక ఇయాల్ల వచ్చి ఒక్క పనైన చేసిరంద్ర అంటూ మహిళ నిరసన వ్యక్తం చేయగా, ఓ వృద్ధుడు బీజేపోల్లను నాకు ఫించన్ వస్తుంది పోండిరా పోండి అంటూ బీజేపోళ్లను తిడుతున్నాడు. ఎప్పుడు వస్తుంది...ఎన్నడు వస్తుంది... అని బీజేపీ నాయకులు అడగ్గా రామలింగారెడ్డి ఉండంగనే.. మస్తుమందికి వచ్చిందని వృద్ధుడు ఎమ్మెల్యే రఘునంధన్‌రావుపై, బీజేపీ నాయకులపై అరుస్తూ ఆందోళన వ్యక్తం చేశాడు.

## గీతంలో ముగిసిన హ్యాకథాన్ పోటీలు



హ్యాకథాన్ పోటీల్లో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులు

పటాన్‌చెరు, అక్టోబర్ 27 : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సెంటర్‌తో కలిసి గీతం వార్షిక హ్యాకథాన్ జీ-హ్యాక్-2023 పోటీలను శుక్రవారం నిర్వహించారు. గురువారం నుంచి ప్రారంభమైన మారథాన్ పోటీలో హైదరాబాద్ నలుమూలల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. జంబోరీ, రెడ్‌బుల్, సందీప్ టెక్నాలజీల సహకారం అందించాయి. పోటీకి హాజరైన ఇంజినీరింగ్ విద్యార్థులు అపారమైన ప్రతిభను, వినూత్నమైన ఆలోచనలను ప్రదర్శించారు. సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎంజీఐటీ, పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీ, ఐఐటీ హైదరాబాద్‌తో పాటు 21 బృందాలు ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నాయి. వినియోగదారుల దృక్కోణం, కార్యచరణ, క్లిష్టత స్థాయివంటి ప్రమాణాల ఆధారంగా జడ్జిలు ఆయా ప్రాజెక్టులను మూల్యాంకనం చేశారు. జీ-హ్యాక్ అనేది విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంచి, వినూత్నమైన ఆవిష్కరణలను రూపొందించే వేదికగా గీతం ప్రతినిధి ప్రొఫెసర్ త్రినాథరావు పేర్కొన్నారు. ఈ పోటీలో రోహన్, మహ్మద్ సిరాజుద్దీన్, సాయిరాజ్, త్రయంబకేశ్వర్, ప్రసాద్‌లతో కూడిన ఎంఎల్‌ఆర్ఐటీ ఇంజినీరింగ్ కాలేజీ తొలి స్థానంలో నిలిచింది. బీ తరుణ్, కే నిష్మాతో కూడిన గీతం, జీఆర్ఐటీ టర్నిషర్స్ బృందం రెండో స్థానంలో నిలిచింది. వెంకట శ్రీరామ్, వర్షిత పటేల్, సాత్విక్ వర్ధన్, సాయి గణేశ్, పూజితతో కూడిన ఎంజీఐటీ కాలేజీకి చెందిన తరంగిణి హెట్రో టెక్ బృందం మూడో స్థానంలో నిలిచింది.

## నేడు ఏడుపాయల ఆలయం మూసివేత

పాపన్నపేట,అక్టోబర్ 27 : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీ మాత ఆలయాన్ని శనివారం చంద్రగ్రహణం పురస్కరించుకొని మూసివేసిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహనరెడ్డి వెల్లడించారు.

## అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద
# రూ. 4.55 కోట్ల బంగారు నగలు స్వాధీనం


- గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న బంగారు నగలు
- సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్
- చెరాగ్‌పల్లి ఎస్సై నరేశ్ వెల్లడి



సరైన పత్రాలు లేకుండా గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న నగలు

జహీరాబాద్, అక్టోబర్ 27: అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, సరైన పత్రాలు లేని రూ. 4.55 కోట్ల బంగార నగలు స్వాధీనం చేసుకున్నామని చెరాగ్‌పల్లి ఎస్సై నరేశ్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లి శివారులో మాడ్గి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, వాహనంలో సరైన పత్రాలు లేని బంగారు నగలు సీజ్ చేశామన్నారు. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు స్కార్పియో వాహనంలో సరైన పత్రాలు లేకుండా 6,986.30 గ్రాములు, 22 క్యారెట్ బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నగల విలువ మార్కెట్‌లో రూ. 4.55 కోట్లు ఉంటుందని తెలిపారు. తెలంగాణలో శాసన సభ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కర్ణాటక సరిహద్దులో అంతర్ రాష్ట్ర ఉమ్మడి చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. 24 గంటలు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయడంతో పాటు రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ప్రతి వాహనం తనిఖీ చేసి సరైన పత్రాలు లేకపోతే నగదు, నగలు స్వాధీనం చేసుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఉన్నత అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

## ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



వాహనాలను తనిఖీచేస్తున్న అడిషనల్ డీసీపీ ఎల్ అండ్‌వో మల్లారెడ్డి

ములుగు, అక్టోబర్ 27 : చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనఖీ చేయాలని ఎవరినీ ఉపేక్షించవద్దని అడిషనల్ డీసీపీ ఎల్అండ్‌వో మల్లారెడ్డి అన్నారు. ములుగు మండల పరిధిలోని వంటిమామిడిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం సిబ్బంది తనిఖీని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయ న వెంట ములుగు పోలీస్ సిబ్బంది ఉన్నారు.